## 'ప్రవాసాంధ్ర స్త్రీ సాహిత్యం'



టెక్సాస్ : ప్రవాసాంధ్ర స్త్రీలు వారి సామాజిక సమస్యలు, జీవనం మీద రచనలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రీమతి కల్పన రెంటాల పిలుపునిచ్చారు. ఉత్తర టెక్సాస్ తెలుగు అసోసియేషన్ సంస్థ తెలుగు సాహితీ వేదిక నిర్వహిస్తున్న 'నెల నెలా తెలుగు వెన్నెల' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డల్లాస్‌లోని 'స్పైస్ ఇన్ రెస్టారెంట్'లో జనవరి 18 ఆదివారం ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 45 మంది సాహితీ ప్రియులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎండ్లూరి సుధాకర్ రచించిన కొన్ని కవితలను తోటకూర ప్రసాద్ చదివి వినిపించారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీమతి కల్పన రెంటాలను ఆయన సభకు పరిచయం చేశారు. ముఖ్య అతిథి ప్రసంగం అనంతరం వేదుల గౌరి తమ తండ్రి రాసిన రామకృష్ణ శతకంలోని కొన్ని పద్యాలు చదివి వినిపించారు. తరువాత కె.సి. చేకూరి 'తెలుగు మాండలికాలు' అనే అంశంపై మాట్లాడారు. వివిధ ప్రాంతాలవారు మాట్లాడే తెలుగు భాషా వైవిధ్యాన్ని ఆయన తన ప్రసంగంలో వివరించారు. తాను రాసిన కొన్ని పద్యాలను గన్నవరం నరసింహమూర్తి చదవి వినిపించారు.



బుకర్ బహుమతి గెలిచి అరవింద్ అడిగ నవల 'ది వైట్ టైగర్' సారాంశాన్ని ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన అనంత్ మల్లవరపు వినిపించారు. ముఖ్య అతిథిని శ్యామల రుమాల్ల, శాంత పులిగండ్ల శాలువతో సత్కరించారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్ చంద్ర కన్నెగంటి పుష్పగుచ్ఛంతో, టాంటెక్స్ ప్రెసిడెంట్ శ్రీధర్ కొర్సపాటి జ్ఞాపికను అందించారు. సభకు ఎం.వి. ప్రసాద్ వందన సమర్పణ చేశారు.